జీవనం.. దయనీయం



వారపు సంతలో దర్జీలు

- దర్జీలకు కరువైన ఉపాధి
- పండగ సమయాల్లోనే అంతంతమాత్రంగా వ్యాపారం
- రెడీమేడ్ రంగంతో దొరకని పని
- గత వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో 'జగనన్న చేదోడు'తో సాయం
- ప్రస్తుతం పట్టించుకోని కూటమి ప్రభుత్వం



వారపు సంతలో మహిళా టైలర్లు

పెదబయలు: దర్జీల బతుకులు నేడు దయనీయంగా మారాయి. రెడీమేడ్ రంగం ప్రవేశంతో దర్జీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10వేలు చొప్పున సాయమందింది. ప్రతి టైలర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా జగన్ ప్రభుత్వం నాడు అండగా నిలిచి ఆదుకుంది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టైలర్లపై కనీస దృష్టి సారించలేదు. ఇటు పనులు లేక అటు ప్రభుత్వం సాయం అందక దర్జీల జీవనం దుర్భంగా మారింది. పూట గడవడం కష్టతరమైంది.

తగ్గిన వ్యాపారం

మన్యంలో వారపు సంతలే షాపింగ్ మాల్స్‌గా చలామణీ అవుతుంటాయి. ఎంతో కాలంగా సంతల్లో వ్యాపారం జరుగుతుంది. సంతలో అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం జోరుగా జరుగుతోంది. దీనికి అనుబంధంగా టైలర్లు సంతలను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. గిరిజనులు సంతల్లో కొనుగోలు చేసిన దుస్తులను ఇక్కడున్న టైలర్ల వద్దే కుట్టించుకుంటారు. గతంలో సంతల్లో టైలర్లకు పని బాగా ఉండేది. పండగ సీజన్‌లలో ఖాళీ ఉండేది కాదు. వారం, పది రోజులకు ముందుగానే టైలర్లకు అడ్వాన్స్‌లు ఇచ్చి దుస్తులు కుట్టించుకునే వారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. రెడీమేడ్ రంగం ప్రవేశించడంతో టైలర్లకు పని తగ్గిపోయింది. రెడీమేడ్ దుస్తులపైనే ప్రజలు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో తదితర ఆన్‌లైన్ షాపింగ్‌ల వ్యాపారం జోరుగా జరుగుతోంది. పలు రకాల మోడల్స్ ఉన్న దుస్తులు ఆన్‌లైన్‌లో ఉండడంతో గిరిజనులు సైతం విపరీతంగా ఆర్డర్‌లు చేస్తున్నారు. గతంలో కూడా ఆన్‌లైన్ షాపింగ్ ఉన్నప్పటికీ చాలా గిరిజన గ్రామాలకు సెల్ సేవలు, నెట్‌వర్క్ సిగ్నల్స్ తక్కువగా ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మన్యంలోని ప్రతి గ్రామానికి సెల్‌సిగ్నల్ వ్యవస్థ, నెట్‌వర్క్ సేవలు పూర్తిగా ఉండేలా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం కోట్లాది రూపాయలతో అన్ని ప్రాంతాల్లో సెల్ టవర్లు, ఇతరత్రా సాంకేతిక వ్యవస్థను ఏర్పాటుచేశారు. దీంతో ప్రస్తుతం మన్యంలో చాలా ప్రాంతాల్లో విస్తారంగా సెల్ సిగ్నల్ వ్యవస్థతో పాటు నెట్‌వర్క్ సేవలు అందుతున్నాయి. మన్యంలోని మొబైల్ డేటా వినియోగం గతంలో కంటే ఎక్కువగా పెరిగింది. ఆన్‌లైన్ షాపింగ్‌లలో దుస్తుల ఆర్డర్స్‌లు గణనీయంగా పెరిగాయి. ఫలితంగా మన్యం దర్జీలకు పని ఉండడం లేదు. పూట గడవడం కష్టంగా మారింది. దీంతో సంతల్లో కేవలం దీపావళి, క్రిస్మస్, సంకాంత్రి పండగల సమయాల్లో మాత్రమే పది రోజుల పాటు పని ఉంటుందని మిగిలిన సమయాల్లో పని ఉండడం లేదని దర్జీలు వాపోతున్నారు.

'జగనన్న చేదోడు'తో ఆర్థిక భరోసా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న చేదోడు ఎంతగానో ఆదుకుంది. గిరిజన ప్రాంతంలో వారపు సంతల్లో, గ్రామాల్లో చిన్నపాటి టైలరింగ్ పని చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి గుర్తించి గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.10 వేల వరకు ఆర్థిక సాయం అందించారు. నాలుగేళ్ల పాటు రూ.40 వేల పొందడం జరిగింది. దీంతో దర్జీలకు ఎంతో ఆర్థిక భరోసా కలిగింది. పండగల సీజన్‌లో సంతలో రూ.1500 నుంచి రూ.2 వేల పని దొరుతుందని మిగిలిన సమయాల్లో వారానికి ఒక్క సంత రోజున వంద రూపాయల వ్యాపారం కూడా జరగడం లేదని దర్జీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా పేదల కోసం ఒక్క పథకం అమలుచేయలేదని చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

15 ఏళ్లుగా టైలరింగ్ వృత్తి



15 ఏళ్ల నుంచి టైలరింగ్ పనిచేస్తున్నాను. గతంలో సంతల్లో దుస్తులు కుట్టించడానికి గిరిజనం ఎక్కువగా మక్కువ చూపించేవారు. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తులపై ఆశక్తి చూపిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న చేదోడు కింద నాలుగేళ్లు రూ.40 వేలు జమ చేయడం జరిగింది. ప్రస్తుతం పని లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. కూటమీ ప్రభుత్వం టైలర్లను ఆదుకోవాలి.

– పసుపుల సుశీల, టైలర్, ముసిడిపుట్టు గ్రామం, పెదబయలు మండలం

సంతల్లో బోణీపడడం లేదు



పండగ సంతల్లో మాత్రమే పని దొరుకుతుంది.మిగిలిన రోజుల్లో బోణీ పడడం లేదు. పని దొరుతుందని ఆశతో సంతలకు ప్రతి వారం వస్తున్నాం. పూట గడిచేందుకు కూలీ పనులకు వెళ్తున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా కష్టాలు తెలిసి ఆదుకుంది. ఐటీడీఏ అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం కుట్టడానికి అవకాశం కల్పించి ఆదుకోవాలి.

– పురసకారి బోడిరాజు, టైలర్, బొండాపల్లి గ్రామం.పెదబయలు

క్లుప్తంగా

7న మండల సమావేశం

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 7న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి సంబంధించి ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం ఇచ్చామన్నారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయి వివరాలతో కూడిన రికార్డులతో హాజరుకావాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని గరుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మోహన్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. పాఠశాలలో అయిదో తరగతిలో-60సీట్లు, ఆరులో-15 సీట్లు, ఎనిమిదిలో-3, తొమ్మిది తరగతిలో-రెండు సీట్లు ఖాళీలున్నట్టు పేర్కొన్నారు. పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయిదవ తరగతిలో చేరే వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

వృత్తిదారుల సంక్షేమానికి కృషి



ఎలక్ట్రీషియన్, ప్లంబర్ల మండల కమిటీ నూతన కార్యవర్గం

జి.మాడుగుల: మండలంలోని మత్స్యమాడుగులమ్మ ఎలక్ట్రీషియన్, ప్లంబర్ల మండల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా కుల్లు వాసు, కార్యదర్శిగా గుల్లెలి లీలాసాయికృష్ణ, ఉపాధ్యక్షుడిగా సరమండ గిరి ప్రసాద్, సభ్యులుగా జగదీష్, ప్రసాద్ నాయుడు, చిరంజీవి, ఎం.సత్తిబాబు, రుద్విన్, దేవరాజు, సునిల్, చందు, కె సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్, ప్లంబర్ల వృత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

ఘనంగా అమ్మవారి జాతర



పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి: మండలంలోని తాజంగిలో దొంతులమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం నుంచి తాజంగి గ్రామ దేవత ఉత్సవాలు మొదలయ్యాయి. బుధవారం వరకూ ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా తాజంగి దొంతులమ్మ కొండపై ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతున్నాయి. జాతర సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి



విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ఈశ్వరరావు

హుకుంపేట: విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో ఈశ్వరరావు ఆదేశించారు. మండలంలోని గిల్లబద్దు, గుమ్మడిగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. మెరుగైన విద్యను అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 358 మంది విద్యార్థులు హాజరు



పరీక్ష రాసేందుకు కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక బాలికల గురుకుల కళాశాల కేంద్రంగా మంగళవారం జరిగిన ఇంటర్ ఇంగ్లిష్ పేపర్-1కు 374 మందికి గాను 358 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్టు సూపరింటెండెంట్ సంతోషికుమారి తెలిపారు. 16 మంది హాజరుకాలేదన్నారు. ఈ కేంద్రంలో బాలికల గురుకుల జూనియర్ కళాశాలతో పాటు స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాల, టెన్‌ప్లస్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాస్తున్నట్టు తెలిపారు.

లక్ష్యానికి మించి ఉపాధి పని దినాలు



సూరంపాలెంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ విద్యాసాగర్

రాజవొమ్మంగి: ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో లక్ష్యానికి మించి పని దినాలు పూర్తి చేసినట్లు డ్వామా పీడీ విద్యాసాగర్ అన్నారు. ఆయన మంగళవారం మండలంలో జరుగుతున్న ఫారం పాండ్స్, తదితర ఉపాధి పనులను పరిశీలించారు. ఇప్పటికే చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మార్చి నెలాఖరుకు రూ.1.28 కోట్ల పనిదినాలు కల్పన లక్ష్యం కాగా ఇప్పటికే 1.54 కోట్ల పనిదినాలు వేతనదారులకు కల్పించడం జరిగిందన్నారు. ఏపీఓ రెడ్డిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి ఆటల పోటీలు

కొయ్యూరు: మండలంలోని బాలారం పంచాయతీలో బంగారు తల్లి ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 23న ఎడ్ల బండి పోటీలు, 25న ట్రాక్టర్ రివర్స్ పోటీలు, 26, 27న వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆనంద్ కుమార్,లక్ష్మి రాజు, నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు బంగారు తల్లి ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలు

మాజీ సర్పంచ్ అపన్న శ్రీరాములు జ్ఞాపకార్థం ఈనెల తొమ్మిది నుంచి మెగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు మృతుడి తనయుడు ఆనంద్ కుమార్ మంగళవారం తెలిపారు. పోటీలో మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9390219346, 9441243122 లను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీగా గాదె విజయంపై ఉపాధ్యాయుల హర్షం



ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు



దుంబ్రిగుడలో కేక్ కట్ చేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి అప్పలరాజు తదితరులు

పాడేరు : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడును గెలిపించిన గిరిజన ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, విశాఖపట్నం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిముడు దేముళ్లు నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపునకు గిరిజన ప్రాంత ఉపాధ్యాయులు విశేష కృషి చేశారన్నారు. గిరిజన ప్రాంతంలో అన్ని వర్గాల ఉపాధ్యాయుల సమస్యలపై శాసన మండలిలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు గళం విప్పుతారని పేర్కొన్నారు.

దుంబ్రిగుడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులనాయుడు గెలుపుపై జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు, మండల అధ్యక్షుడు లక్ష్మయ్యలు హర్షం వ్యక్తం చేశారు. కేక్‌ను కట్‌చేసి ఉపాధ్యాయులకు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిబద్ధతతో కృషి చేస్తున్న గాదెకు పట్టం కట్టడం అభినందనీయమన్నారు. ఆయన గెలుపును గిరిజన ఉపాధ్యాయుల కృషి ఉండడం ఎంతో సంతోషమన్నరు. గెన్ను, ధర్మ, చిన్ని, రాంప్రసాద్, మధుసూదన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సాయి చైతన్య

వి.ఆర్.పురం: మండలంలోని రేఖపల్లిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏఎస్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ సాయి చైతన్య మాట్లాడుతూ ప్రతి దివ్యాంగుడు యుడీఐడీ కార్డు పొందాలన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు పొందేందుకు సదరం సర్టిఫికెట్‌తో యూడీఐడీ తప్పనిసరిగా ఉండాన్నారు. దివ్యాంగులు బ్యాటరీ సైకిల్, స్కూటీ కోసం దరఖాస్తు చేసుకొవాలని సూచించారు. కో-ఆర్డినేటర్ రవి, హరిబాబు, ముత్యాలరావు, రాజారావు, పూజిత, సౌజన్య, ప్రసాద్, మీనా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు, ప్రజా సమస్యలను పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించాలని తహసీల్దారు రామకృష్ణ అన్నారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దీంతో గిరిజన రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు జరుగుతుందని, అన్ని పథకాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. డీటీ దుమంతి సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన కమిటీ ఎన్నిక



శ్యాంప్రసాద్‌ను అభినందిస్తున్న నాయకులు

ఎటపాక: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా నలజాల శ్యాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూడె సతీష్‌కుమార్‌నాయక్ అధ్యక్షతన మంగళవారం మండల పార్టీ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శులు పి.రాజు, జి.రమేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దుర్గారావు శ్యాంప్రసాద్ పేరును ప్రతిపాదించగా 21 మంది కమిటీని ఎన్నుకున్నారు. సత్యం, ప్రసాద్, సురేంద్ర, అంజిబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మోదమాంబ అమ్మవారి తీర్థం



పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల: మన్యం దేవత, మాడుగుల ప్రజల ఇలవేల్పు మోదమాంబ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఘటాలతో వచ్చి దర్శించుకున్నారు. పండగ సందర్భంగా విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. బాణసంచా వెలిగించారు. థింసా నృత్యం, కోలాటం, నేల నృత్యాలు భక్తులను అలరించాయి. ఈ సందర్భంగా ఎడ్ల పరుగుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయండి



చింతపల్లి సబ్ సెంటర్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఆశ కార్యకర్తలు



జడ్డంగిలో వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు



లబ్బూరు పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు, ఆశ కార్యకర్తలు

చింతపల్లి: ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరతూ ఈ నెల 6న చేపడుతున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ దాసమ్మలు ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఆర్.వి.నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల చింతపల్లి సబ్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సిహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

ముంచంగిపుట్టు: ఆశ కార్యకర్తలకు కనీస వేతనం జీవోను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు అన్నారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు పీహెచ్‌సీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమ చేపట్టారు.సీఐటియూ మండల కార్యదర్శి శంకర్‌రావు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదిన చలో విజయవాడ మహా ధర్నాలో అధిక సంఖ్యలో ఆశ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. శాంతమ్మ, జాన్యోతి, సుమిత్ర, తుల్లమ్మ, చంద్రమ్మ, జయ, పుల్మలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఈనెల 6న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశ వర్కర్ల మండల యూనియన్ అధ్యక్షురాలు కోపూరి చంద్రావతి పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో ఆమె ఆశవర్కర్లతో కలసి మంగళవారం జడ్డంగి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ యామినిప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. చంద్రావతి మాట్లాడుతు ఆశ వర్కర్లపై వేధింపులు ఆపాలని తదితర పలు డిమాండ్లను ఆ వినతి పత్రం పేర్కొన్నారు. రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌సీల్లో కూడా ఇదే తరహాలో మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేసారు.

టార్పాలిన్‌ల పంపిణీ



కాఫీ రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న జీసీసీ మేనేజర్ వెంకటేష్, సిబ్బంది

హుకుంపేట: కాఫీ రైతులు దళారీ వద్ద మోసపోకుండా కాఫీ, మిరియాలను జీసీసీ డిపోల్లోనే విక్రయించాలని జీసీసీ మేనేజర్ బి.వెంకటేష్ చెప్పారు. మండలంలోని సూకురు, భీమవరం, సంతారి, శోభకోట, గూడ, మత్స్యపురం, బాకురు పంచాయతీల పరిధిలోని పలు గ్రామల్లో కాఫీ పంట పండించి జీసీసీకి విక్రయిస్తున్న 50 మంది కాఫీ రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీకి కాఫీ విక్రయిస్తున్న రైతులను ప్రొత్సహించేందుకు టార్పాలిన్లు అందజేసినట్టు చెప్పారు. ఇటీవల సుమారు 200 కిలోలకు పైబడి కాఫీ జీసీసీలో విక్రయాలు అయినట్టు తెలిపారు. బాలరాజు, లింగన్నదొర, ఈశ్వరరావు, మోహన్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



స్టేషనరీ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కొయ్యూరు: మండలంలో పదో తరగతి చదువుతున్న అన్ని పాఠశాలల విద్యార్థులకు అవసరమైన స్టేషనరీని అందజేస్తామని నర్సీపట్నానికి చెందిన రిషి స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం.మురళీకృష్ణ చెప్పారు. మండలంలోని చిట్టింపాడు, డౌనూరులో పదో తరగతి విద్యార్థులకు ఆయన మంగళవారం స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి టాపర్‌గా నిలిచిన వారికి ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. రిషి విద్యా సంస్థల ఏవో శ్రీను, హెచ్‌ఎంలు సత్యనారాయణ, ప్రభుదాస్ పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న సురేష్ కుమార్, జెడ్పీటీసీ నూకరాజు, హెచ్‌ఎం ప్రభుదాసు తదితరులు

కొయ్యూరు: మండలంలోని డౌనూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వైఎస్సార్, టీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ టి.సురేష్ కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కష్టాన్ని ఇష్టంగా మార్చుకుని చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఉన్నత స్థానాలు అధిరోహించేందుకు లక్ష్యాలను పెట్టుకోవాలన్నారు. లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సంస్థ తరఫున సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు మాట్లాడుతూ సురేష్ కుమార్ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని సూచించారు. హెచ్‌ఎం ప్రభుదాస్, వార్డెన్ హరిదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మినప పంట

రోలుగుంట : మండలంలో సుమారు 930 ఎకరాల విస్తీర్ణంలో మినపసాగు చేస్తున్నారు. ఖరీఫ్ వరి కోతల అనంతరం రైతులు తమ పంట భూముల్లో ఈ పంట సాగు చేశారు. పంట కోతకు రావడంతో చేను నుంచి పంట సేకరణ పనులు చేట్టారు. ఖరీఫ్ కోతల సమయంలో ఎకరాకి సుమారుగా కుంచెడు విత్తనాలు చల్లితే చాలని, అప్పటి పదునుకు విత్తనాలు మెలకెత్తుతాయని, తరువాత మంచు తడులకు పంట అభివృద్ధి చెందుతుందని రైతులు చెబుతున్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తీర్థం

దేవరాపల్లి : మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఏ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, కెఎం.పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళల కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలను బాబురావు, సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, గంధం రామకృష్ణ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలలో ప్రథమ విజేతగా దేవరాపల్లి వీరాంజనేయ ఎడ్లు, ద్వితీయ స్థానంలో దేవరాపల్లి శ్రీలక్ష్మీనర్సింహ ఎడ్లు, తృతీయ స్థానంలో నర్సాపురం సంపత్ వినాయక ఎడ్లు నిలిచాయి.